# ఆకాశంలో హాక్సిడెంటు

**చా**లా విచారంగా ఉన్నాను. సమయానికి భద్రం ఎటో వెళ్ళాడు. వాడు దగ్గిర లేకపోవడం చూసి రకరకాలనుమాన పిశాచాలు నన్ను పట్టుకున్నాయి. నేను నిజంగా డిటెక్టివునేనా? అయితే నన్ను ఎవరూ ట్రంకు చెయ్యరేం? మెట్లమీద టకటక వినిపించి ఎన్నాళ్ళయిందీ? ఆ హైరాస వాళ్ళు కూడ హయిపే లేదు. వాళ్ళ అక్కర తీరిపోయింది. వాళ్ళ కింకా నాతో ఏం పనీ? ఎవరికీ మాత్రం నాతో ఏం పనీ?

కాస్సేపు హాయిగా ఏడిచాను.

"అదేంటి, గురో?" అన్నది భద్రం గొంతు.

నేను కళ్ళు తుడుచుకుని భద్రంకేసి చూశాను. "ఇంతసేపు ఎక్కడికి వెళ్ళావ్? ఈలోగా ఏదన్నా కేసు వస్తే నా గతి ఏమై ఉండేది?" అన్నాను, భద్రం చంకలో ఉన్న అట్టపెట్టె గమనించకుండానే.

"ఎవరన్నా ట్రంకు వేశారా?" అన్నాడు భద్రం ఆత్రంగా.

"లేదనుకో.. చూడు, భద్రం. ఈ హైరాన వాళ్ళున్నారే, వాళ్ళేమంత ఘరానా మనుషులల్లే కనిపించరే?" అన్నాను.

"చంపేశారు, గురో! ఆ సెకరట్రీ ఉన్నాడే, ఆయన హోల్ యావత్ ప్రపంచానికీ సెకరట్రీ గురో! ఒక్క చీనాకు మాత్తరం సెకరట్రీ కాడు. చీనా చక్కరవర్తి చియాంగ్ షేకు అరణ్ణవాసం వెల్లాడుగా? అందునుంచి!"

భద్రానికి చాలా విషయాలు తెలుసు. అందుకనే నాకేదన్నా హనుమానం తగిలితే వాణ్ణి అడుగుతుంటా.

"నువు చెప్పిందే నిజమైతే ఈ హైరాసలో ఓం మంత్రి లేడేం? ఉంటే ఆయన నాతో మాట్లాడలేదేం? నా చెయ్యి పట్టుకుని ఓం మంఅరతి ఎందుకు నొక్కలేదు, భద్రం?" అన్నాను.

"ఐరాసలో మంత్రులుండరు, గురో!" అన్నాడు భద్రం విచారంగా.

"మిగిలిన డిటెక్టివులంతా భారతమాతకు సేవ చేస్తుంటే నాకీ హైరాస ఎందుకు దాపరించాలీ? ఒక్క ఓం మంత్రి కూడా లేని హైరాస ఎందుకూ, ఎడవనా?" అన్నాను కుంగిపోతూ.

"కాస్త వోపికపట్టాలి, గురో! ముందు ఈ బిస చూడండి!" అన్నాడు భద్రం తన చంకలో ఉన్న అట్టపెట్టె తీసి, అందులోనుంచి ఒక వస్తువు బయటకు తీస్తూ.

ఆ వస్తువు చూడగానే నా వళ్ళంతా గరీబొడిచింది. అది చూడటానికి జోడు గుళ్ళ యేటు బాంబల్లే వుంది. "అదేంటి భద్రం?" అన్నాను.

"బైనాక్లర్స్! అన్నాడు భద్రం పళ్ళికిలిస్తూ. ఆ మాట కూడా నేనెప్పుడూ వినలేదు.

"చూడు, భద్రం! నువ్వేదైనా వస్తువు తెస్తే దాని పేరు రెండక్షరాలు మించకుండా ఉండేట్టు చూడు! ఈ నోరు తిరగని వస్తువు ఏమిటి?... ఏదో స్క్రూ తిప్పుతున్నావే, అది పేలదు గదా?" అన్నాను.

"పోలీస్ చేస్తున్నాను, గురో! ఒక్క క్షణం!"

"ఆ బైనాని దేనికో బారు చేస్తున్నావే. పేలేముందు చెప్పు, చెవులు మూసుకుంటా" అన్నాను.

"ఇది పేలదు, గురో! దీంతో మనం దూరం వస్తువులు కూడా దగ్గిరగా చూడవచ్చు. ప్రతి డిటెక్టివు దగ్గిరా ఉండాల్సిన సామాను" అంటూ భద్రం ఆ బైనాలోంచి ఎట్టా చూడాలో నాకు చెప్పాడు.

బైనాని ఆకాశంకేసి తిప్పి చూశా. చెప్పొద్దూ, ఆకాశం దగ్గిర కొచ్చినట్టు నా కేమంత అనిపించలా. ఆ మాటే భద్రంతో అన్నా. భద్రం ఏదో అంటున్నాడు. ఇంతలో, "ఒండ్రఫుల్, ఒండ్రఫుల్!" అని నా నోటి గొంతు నాకే వినిపించింది.

నా గొంతు కంఠస్వరం విని భద్రం "ఏం కనబడిందేటి, గురో?" అన్నాడు.

"విమానం, భద్రం! విమానం!" అన్నాను.

"బైనాక్లర్స్ యేసి చూడండి. క్లూలేమైనా దొరుకుతయ్యేమో!"

"ఆ విమానం మీద ఏదో రాసుంది, భద్రం, బైనా ఏసి చదువూ!" అన్నాను.

"ఐ.ఎన్.ఎ.టి." అని చదివాడు భద్రం.

"అంటే?" అన్నాను.

"అంటే-ఇంటరేషనల్ ఆటమ్ టీన్స్ అన్నమాట గురో!"

"అంటే?"

"అంతర్జాతీయ ఏటు బాంబు దొంగ అన్న మాట."

నేను రెండడుగులు గాలిలోకి యెలికాప్టర్ లాగా లేచి మళ్ళా కిందబడి, "అంతా యేదో గాళ్ళే? వాళ్ళని తరమాలి. నీ ఎలికాప్టర్ తియ్యి" అని గొంతు చించుకు అరిచాను.

"ఛనం!" అంటూ భద్రం దొడ్లోకి పరిగెత్తాడు.

మరి కాస్సేపటికల్లా మా ఎలికాప్టరు దూసుకుపోతున్నది. అంతా యేదోగాళ్ళ విమానం రెండు పల్టీలు గొట్టి సూటిగా మా ఎలికాప్టర్ మీదికి దూసుకు వచ్చింది.

"భద్రం. ఎలికాప్టర్ భద్రం!" అన్నా.

మా ఎలికాప్టర్ లటుక్కున క్రిందికి జారింది. అంతా యేదోగాళ్ళ విమానం మా తలమీదుగా దూసుకుపోయింది.

భద్రం! ఎలికాప్టర్‌ను రెండు పల్టీలు కొట్టించి అంతా యేదోగాళ్ళ విమానాన్ని వెంటాడసాగాడు.

"భద్రం, వీళ్ళు మనమీద కన్నేసి వుంచారు. ఏమంటావ్?" అన్నా.

"సందేహమేంటి, గురో? మనకే యాక్సిడెంటు పెట్టాలని చూశారు."

"ఇంత ఘోరవా?"

"వాళ్ళకి భయమేం లేదు గురో! ఒక్కొక్కడి జేబులోనూ మూడేసి ఎలికాప్టర్లుంటాయి గురో! వాళ్ళు చేసేదంతా పబిలీగ్గానే చేస్తారు. అదే అంతర్జాతీయ గాళ్ళ గొప్పతనం!"

"అయితే వాళ్ళను తప్పించుకు పోనీమాకు? ఇంకొంచెం నూనె వొదులు! ఇంకా దూసుకుపోనీ ఎలికాప్టర్ని."

ఇహ జూసుకో-! 'ఎలికాప్టరు' 'ఆగమేగమారు తీసే' లాగా పోతున్నది. వాళ్ళు మాత్రం తక్కువ వాళ్ళా? వాళ్ళూ స్పీడొదిలారు.

"భద్రం! అందులో ఎవరెవరున్నారు?"

"ఒకటీ, రెండూ, మూడూ, నాలుగూ – నలుగురున్నారు."

"వాళ్ళే హనుమానం లేదు. గడ్డాలున్నాయా?"

"డ్రయివరకు మాత్రం ఉంది, గురో!"

"మిగిలిన వాళ్ళు మారు వేషాలేసుకుని ఉంటారు."

బైనా తీసి చూశాను. కాకి పిట్టులో ఏదో తువాలులో మూట కట్టి ఉంది. అది టాక్సీ బాంబు అయి ఉంటుంది. దాన్ని కనిపెట్టిన చయనులుగారు చెప్పటం, అది పేలిన చోట నుంచి పదిహేను వేల మైళ్ళదాకా ఏ ప్రాణి దక్కదని, హైరాస సెక్రట్రీ సరే సరి – యావత్ హోల్ ప్రపంచం చిన్న బొగ్గు అయిపోతుందన్నాడు. అంతా ఏదో గాళ్ళు ఆ బాంబుని మళ్ళీ దొంగతనం చేశారు.

"భద్రం, సెక్రట్రీగారు నన్నెందుకు ట్రంకు చెయ్యలేదంటావు? బైనా ఏసి చూస్తే బాంబు దొంగల దగ్గిర కనిపిస్తున్నది."

"మీరు పొరపాటు పడివుంటారు, గురో! బాంబు పోతే తప్పక టెలిఫోను కొట్టేవాడే. లేకపోతే బాంబు పోయిన సంగతి ఆయన కింకా తెలవలేదు!"

"ఇవాళ నీ బుద్ధి హద్భుతంగా పనిచేస్తున్నది భద్రం. బాంబు పోయింది. కాని ఈ సంగతి ఇంకా ఎవరికీ తెలీదు. చూశావా, డిటెక్టివు కావడంలో ఎంత గమ్మత్తుందో! ఇది టార్కీ, టిక్కూగాళ్ళపనే! ఇప్పుడేం చేద్దామంటావు?"

"సెకట్రరీకి వాయిర్లెస్ కొట్టండి, గురో!"

నేను రేడియో యెత్తి, "అలోవ్!" అన్నాను. హైరాస సెక్రట్రీ కంఠస్వరం.

"అలోవ్, కేయాస్‌గారా? చాలా సంతోషం. మీ గొప్పతనం తెగవింటున్నాను" అన్నాడు.

"చయనులుగారి హాక్సీ బాంబును అంతకులు కాజేశారు. నేను వాళ్ళని ఆకాశంలో తరుముతున్నాను" అన్నాను గంభీరంగా.

"చ-బాం-! తాళం చెవుల గుత్తి నా బల్లమీదే ఉందే! అయినా చూసొస్తాను. ఒక్క క్షణం రేడియో మీదే ఉండండి!" కొద్ది సేపట్లోనే సెక్రట్రీ కంఠస్వరం "హాశ్చర్యం! కేయాస్‌గారూ, బాంబు కనిపించటంలేదు. ఎవరు ఎత్తుకు పోయారో, ఎప్పుడెత్తుకు పోయారో తెలీటంలేదు. చయనులు గార్ని అడ్డగించి ఉంటారు దొంగలు. బహుశా బాంబు అప్పుడే పోయుంటుంది. కిందటిసారి వాళ్ళకు అది చిక్కలేదు కేయాస్‌గారూ! ఎలాగైనా ఆ బాంబు సంపాదించి, ప్రపంచాన్ని కాపాడండి. ఆ దుర్మార్గులు ఆ బాంబు పేల్చారంటే ప్రపంచం మాడి బుగ్గే అయిపోతుంది!" అన్నది.

"అదంతా నాకు వదలండి. నేను ప్రస్తుతం ఆకాశంలో వున్నాను. నా కింకా పైగా వాడున్నాడు! వాడి దయ ఉంటే బాంబును క్షేమంగా పట్టుకొచ్చి మీకిస్తాను" అన్నాను.

మళ్ళీ బైనా వేసి చూశాను. కాకి పిట్టులో మూట పక్కన ఒక సందుగాయి పెట్టె వున్నది. అందులో తప్పక చయనుల్ని పెట్టి వుంటారు. ఈ టార్కి, టిక్కువాళ్ళు తమ దేశానికి వెళ్ళి చయనులు బుర్రకు టుపాకీ బారుచేసి, "ఈ బాంబులు పేలుస్తావా? కాల్చి చంపమా?" అంటారు. అది ఎంతమాత్రం జరగరాదు. జరగనివ్వను.

మళ్ళా రేడియో ఎత్తి "అలోవ్!" అన్నాను.

"అలోవ్" అని విమానం వాళ్ళు పలికారు.

"మీ దగ్గర హాక్సీ బాంబున్నది. నాకు తెలుసు. పది సెకళ్ళలో దాన్ని మీరు నా కివ్వక పోయారంటే మీ విమానం హాక్సీడెంటయిపోతుంది. మీ దగ్గిర చయనులుగా రున్న సంగతి కూడా నేను కనిపెట్టగలిగాను. ఆయన్ని కూడా నా కిచ్చేయాలి" అన్నాను.

"కేయాస్, ఈసారి నీ ఆటలు సాగవు, మా వెంట రాకు వెళ్ళిపో!" అన్నదొక కంఠస్వరం.

"భద్రం, హాక్సిలేటరు బాగా నొక్కు! వాళ్ళ హంతు తేల్చాలి!" అన్నాను.

నేనీ మాట అంటున్నానో లేదో అంతా ఏదో గాల్ళ విమానం మాయమయింది!

"భద్రం, వాళ్ళేరీ?" అన్నాను.

"మలుపు తిరిగి ఎటో జారుకున్నారు, గురో!" అన్నాడు భద్రం.

"అయితే నేరుగా హైరాసకు వెళ్ళు!" అన్నాను.

కొద్దిసేపట్లోనే కొన్ని గుడిసెలు, చింత చెట్లూ, పెంకుటిళ్లూ కనిపించాయి. వాటి పక్కనే దిగాం. ఎలికాప్టరు ఇంకా నేల తాకక ముందే నేను కింద దూకి, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ సెక్రట్రీ ఉండే ఇంట్లోకి పోబోయాను.

గేటు దగ్గిర వున్న గుర్కా నన్ను ఆపి, విజిటుకార్డు చూపించమన్నాడు.

"నా పేరు కేయాస్. సెక్రట్రీగారు నాకోసం ఎదురు చూస్తున్నారు" అన్నాను.

గూర్కా నవ్వి, "తమ పేరు జగత్ప్రసిద్ధం. కాని తమ దర్శనం ఇదే ప్రథమం. చాలా సంతోషం. మీరే గనక సెక్రట్రీగారిని సూటిగా చూడవచ్చు. ఏమీ అభ్యంతరం లేదు" అంటూ నవ్వాడు.

నేను లోపలికి పోబోతుండగా ఒక పెద్ద మనిషి వచ్చి గూర్కాతో "సెక్రట్రీ సీ!" అన్నాడు.

గూర్కా గడియారం చూసుకుని, "ఇంకో గంటదాకా వీలుపడదు. మీరెవరూ?" అన్నాడు.

"నేను బెనిలక్సు ప్రధాన మంత్రిని. చాలా అర్జంటు పని. స్కాండినేవియా యుద్ధ మంత్రిగారింకారాలేదా?" అన్నాడాయన గూర్కాతో.

"ఇంకా లేదు. విమానం లేటయిందేమో!" అన్నాడు గూర్కా.

నేను భద్రం కేసి చూసి, నవ్వి, తల ఆడించి, రమ్మని సంజ్ఞ చేశాను. ఇద్దరమూ లోపలికెళ్ళాం.

సెక్రట్రీ కాలు కాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఆయన మమ్మల్ని చూడగానే, "వచ్చారా?" అంటూ ముందుకు వచ్చి నా చేతులు రెండూ పట్టుకున్నాడు.

"దొంగలు ప్రస్తుతానికి తప్పించుకుపోయారు. కాని వారి అంతు కనుక్కోకుండా వదలను. మీరు ధైర్యంగా వుండండి!" అన్నాను.

"గురో?" అన్నాడు భద్రం.

"నీ విషయం కాదు. నేను సెక్రట్రీ గారితో మాట్లాడుతున్నాను... సెక్రట్రీగారూ, బాంబు ఎట్లా పోయిందంటారు?"

"దొంగలు దబ్బనంతో తాళం తెరిచారు."

"పాదాల గుర్తులు?"

"లేవు."

"వేళ్ళ గుర్తులు?"

"లేవు."

"బాంబు పోయిందని ఎట్లా తెలుసు?"

"నేను చూశాను. అది దాచిపెట్టే ఇనప్పెట్టే ఖాళీగా ఉంది."

"అరలన్నీ జాగ్రత్తగా వెతికారా?"

"వెతికాను."

"మీకు చత్వారం లేదనుకుంటాను."

"వచ్చిపోయింది... మీరు అసలు సంగతి తెలియక తప్పుదారిన పడుతున్నారు. అయిదు నిమిషాల క్రితం అంతర్జాతీయ దొంగలు నాకు టెలిఫోన్ చేశారు. చైనాకూ రష్యాకూ మధ్య ఇంకొక్క అరగంటలో యుద్ధం వచ్చేట్టు చూడకపోతే బాంబు పేల్చేస్తామని చెప్పారు."

ఇప్పుడేం చేసేటట్టు, కేయాస్‌బాబూ!" అన్నాడు సెక్రట్రీ చేతులు నలుపుకుంటూ.

"వస్తాను!" అంటూ బయటికి బయలుదేరాను.

"చూడండీ –" అన్నాడు సెక్రట్రీ.

"శలవు!" అంటూ భద్రాన్ని వెంటబెట్టుకుని ఎటో వెళ్ళిపోయా.

తర్వాత కాస్సేపటికి మేం ఆకాశంలో ఎగురుతున్నాం.

"భద్రం!"

"గురో!"

"ఈ పని మనవల్ల కావలసిందే!"

"అవును, గురో!"

"ఇంకో డిటెక్టివు వల్ల కాదు!"

"కాదు, గురో!"

"అందు మించి నువు ఎలికాప్టరు జోరుగా తోలు, నేను నా బైనాతో భూమ్యాకాశాలు గాలిస్తా!"

"సరే గురో!"

ఎలికాప్టరు ఆయు వేగాన పోతున్నది. బైనా ఏం పని చెయ్యటం లేదు. ఈ బైనా దేన్నయినా దగ్గిరికి తెస్తుంది గాని ఆకాశాన్ని దగ్గిరికి తీసుకురాలేదు. అందులో ఏదో కిటుకుండాలి.

అకస్మాత్తుగా భద్రం, "తప్పుకో! తప్పుకో!" అని పెద్ద కేక పెట్టాడు. హంతలోకే హాక్సీడెంటయిపోయింది.

విమానం ఎటునించి వచ్చిందో నేనసలు చూడనే లేదు.

"నా కొడుకు రాంగ్ సైడ్ వచ్చాడు" అన్నాడు భద్రం, కాకి పిట్టులో నుంచి బయటికి దిగుతూ. ఏదోవాళ్ళ విమానం రెక్క ఒకటి విరిగిపోయింది. డ్రయివరుకు దెబ్బ తగిలి పడిపోయాడు.

లోపల్నించి ఎవరో మూలుగుతున్నారు.

"భద్రం! ఇది అంతా ఏదోగాళ్ళ విమానం కాదూ" అన్నాను.

"అవును, కాదు, గురో!" అన్నాడు భద్రం, డ్రయివర్ని గడ్డం పట్టి బయటికి ఈడుస్తూ.

"లోపల ఒక కంఠస్వరం మూలుగుతున్నది, భద్రం."

"అవును, గురో!" అంటూ భద్రం విమానంలోకి జొరబడ్డాడు.

తరవాత కాస్సేపటికి, "గురో!" అని పెద్దగా భద్రం కంఠస్వరం పలికింది.

నేనూ విమానంలోకి ఎగబాకాను. విమానంలో ఒక సందుగాయి పెట్టె వుంది. దాని మూత తెరిచివుంది. దాన్ని భద్రమే తెరిచాడని నేను తెలుసుకోగలిగాను.

ఆ పెట్టెలో చయనులుగారున్నాడు. ఆయన తలకింద బాంబు దిండులాగా ఉన్నది.

"మన కర్తవ్యం నెరవేరింది, భద్రం. మనం మరోసారి విజయం సాధించాం. కాని అంతకులెక్కడ?"

"వాళ్ళు పారషూట్లమీద ఆకాశంలోకి ఎగిరిపోయుంటారు, గురో!"

"అంతే నంటావా?"

"బైనాక్లర్సేసి ఆకాశాన్ని చూడండి!"

"నేను బైనా ఏసి ఆకాశాన్ని చూసే మాట హసంభవం. కావలిస్తే నువే చూడు!" అంటూ బైనా భద్రానికిచ్చాను.

భద్రం ఆకాశమంతా చూసి, "మలుపు తిరిగిపోయారు, గురో!" అన్నాడు.

"ఈసారికి తప్పించుకుపోయారు, భద్రం. హైరాసకు పోదాం పద!"

చయనులు గార్ని పెట్టెతో సహా ఎలికోప్టర్‌లో పెట్టి, టైర్లకు కాస్త గాలి కొట్టుకుని బయలుదేరాం.

"మీ కోసం సెకర్ట్రీ గారు ముళ్ళమీద నిలబడి ఎదురు చూస్తున్నారు. మీరు వచ్చారా అని చాలా సార్లడిగారు. ఒకసారి నన్ను పిలిచి, 'ప్రపంచం బొగ్గయిందా?' అని అడిగారు. ఇంకా కాలేదని చెప్పాను. ఏ క్షణాన అయినా కావచ్చునని గొణుక్కున్నారు. నన్నడిగితే ఆయనకు మతి మతిలో ఉన్నట్టులేదు" అన్నాడు గూర్ఖావాడు.

నన్ను చూడగానే హైరాస సెకర్ట్రీగారు చేతులు చాచి ముందుకు వస్తూ "వచ్చారా? చాలా సంతోషం. మీ పేరు ప్రఖ్యాతలు వినటమే గాక మిమ్మల్ని ఇప్పటికి రెండుసార్లు కలుసుకుని, మళ్ళీ మూడోసారి కలుసుకుంటున్నందుకు చాలా గర్వంగా ఉంది!" అన్నాడు.

"ఇదుగో చయనులు గారు. వీరు బహుశా మీకు తెలిసే ఉంటుంది" అంటూ సందుగాయిపెట్టె చూపించాను.

"బాంబు? బాంబెక్కడ?" అన్నాడు సెకర్టరీ ఆదుర్దాగా.

"అదీ అందులోనే వుంది."

"థాంక్స్, థాంక్స్" అంటూ ఆయన ఇంగ్లీషులో ఏదో చాలాసేపు చెప్పాడు. మధ్య మధ్య నేను, "యాస్, యాస్! నెవ్రుమైన్! థాంక్స్! డోన్మెంషన్!" అన్నాను.

"మీరు మరోసారి ప్రపంచాన్ని ఉద్ధరించి గొప్ప పుణ్యం కట్టుకున్నారు. ఈ దెబ్బతో మీ కీర్తి చంద్రమండలానికి కూడా వ్యాపిస్తుంది. అన్నట్టు చంద్రమండలంలో స్థలాలు అమ్ముతున్నారు. రెండు గ్రౌండులు మీ పేర కొనమన్నారా? ఎంతోకాదు, రెండు లక్షలుంటే చాలు! చెక్కిస్తారా, రొక్కమిస్తారా?" అన్నాడు సెక్రట్రీ.

"నా పేర స్థలం జమ రాసి వుంచండి. చంద్రమండలంలో మొట్ట మొదటి డిటెక్టివు కావటం నాక్కూడా చాలా ఇదే! కాని మీతో ఒక్క విషయం చెప్పాలి. మీ హైరాసలో సెక్రట్రీ తప్పలేకపోవడం నాకేం బాగా లేదు. వెంటనే ఓం మంత్రిని ఏర్పాటు చేయండి. ఆయన తరఫున మీరు నన్ను ట్రంకు చేస్తూండొచ్చు. కాని ఓం మంత్రిని చూడకుండా కేసుపట్టటం నా పరువుకు చాలా భంగమని నేను చెప్పటానికి సాహసిస్తున్నాను!" అన్నాను.

"అలాగే ఓ హోం మంత్రిని ఏర్పాటు చేయిస్తాను. ఈసారి మీరు ఆయనను కూడా కలుసుకోవచ్చు" అన్నాడు సెక్రట్రీ.

తరవాత నేనూ, భద్రం విమానం ఎక్కి ఇంటిదారి పట్టాం.

"భద్రం!"

"గురో!"

"ఈసారి చూస్కో."

"అవును, గురో!"

"మనని ఓం మంత్రి ట్రంకు చేస్తాడు."

"ఓం మంత్రి కాదు గురో, హోం మంత్రి."

"ఎవరన్నారు?"

"ఆ సెక్రట్రీయే, గురో!"

"ఆయన డిటెక్టివు చదవడు."

"అంతే అయుంటుంది, గురో!" అన్నాడు భద్రం.

నేను బైనా ఏసి ఆకాశాన్ని చూడసాగాను. ఆకాశం ఎందుకు దగ్గిరకు రాదో ఎంత ఆలోచించినా నాకు అంతు చిక్కలేదు.

***ముద్రణ: ఆంధ్రప్రభ వారపత్రిక, 9 అక్టోబర్ 1957***